## మంచిర్యాల అదనపు కలెక్టర్ చంద్రయ్యకు ఐఏఎస్ హోదా

**కేంద్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ**

**జిల్లా యంత్రాంగం హర్షం**



**జీ న్యూస్, మంచిర్యాల:** మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్యకు ఐఏఎస్ హోదా లభించింది. ఈ మేరకు భారత ప్రభుత్వ పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్ & పెన్షన్స్ మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. చంద్రయ్యను ఐఏఎస్ అధికారులుగా ఖరారు చేస్తూ కేంద్రం నోటిఫికేషన్ విడుదల చేసింది. గత ఏడాది జూలై 17న మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన చంద్రయ్య, అప్పటి నుంచి జిల్లా అభివృద్ధి, రెవెన్యూ వ్యవహారాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. నిబద్ధతతో విధులు నిర్వహిస్తున్న ఆయనకు ఐఏఎస్ హోదా రావడం పట్ల జిల్లా అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## గాంధారి మైసమ్మ జాతర ఏర్పాట్లు పూర్తి చేయాలి

**అధికారులతో ఆర్డీవో శ్రీనివాస్ రావు సమీక్ష**

**ఈ నెల 30 నుంచి మూడు రోజుల పాటు వేడుకలు**



**జీ న్యూస్, మంచిర్యాల:** మందమర్రి మండలం బొక్కలగుట్ట ప్రాంతంలో ఈ నెల 30, 31, ఫిబ్రవరి 1 తేదీలలో జరగనున్న గాంధారి మైసమ్మ జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్ రావు ఆదేశించారు. బుధవారం తన కార్యాలయంలో రెవెన్యూ, పోలీస్, వైద్య, రవాణా తదితర శాఖల అధికారులు, జాతర కమిటీ ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.

**భక్తులకు ఇబ్బందులు కలగొద్దు..**

జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య శిబిరాలు సిద్ధం చేయాలని ఆర్డీవో సూచించారు. అత్యవసర సేవల కోసం అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, తాత్కాలిక పార్కింగ్ స్థలాలు, మరుగుదొడ్ల ఏర్పాటుపై శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు.

**సమన్వయంతో పని చేయాలి..**

ప్రశాంత వాతావరణంలో జాతరను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు, జాతర కమిటీ సభ్యులు సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన గాంధారి ఖిల్లాపై జరిగే ఈ వేడుకలకు భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎక్కడా లోపాలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో 100 శాతం అక్షరాస్యతే లక్ష్యం

**సర్పంచుల శిక్షణలో జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం**

**ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి: సత్యనారాయణ మూర్తి**



**జీ న్యూస్, మంచిర్యాల:** ముల్కల్లలోని ఐజా కాలేజీలో బుధవారం సర్పంచుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం 'ఉల్లాస్ – అమ్మకు అక్షరమాల' కార్యక్రమంపై సర్పంచులకు అవగాహన కల్పించారు. ప్రతి సర్పంచ్ తమ గ్రామంలో 100 శాతం అక్షరాస్యత సాధించేలా ప్రత్యేక కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

**అమ్మకు అక్షరమాల విజయవంతం చేయాలి:**

గ్రామాల్లోని నిరక్షరాస్యులైన వయోజనులు ప్రతి ఒక్కరూ చదువుకునేలా సర్పంచులు ప్రోత్సహించాలని పురుషోత్తం కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'అమ్మకు అక్షరమాల' కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ విజయవంతం చేయాలని సూచించారు.

**ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి...**

విద్యాశాఖ సెక్టోరియల్ ఆఫీసర్ సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ.. గ్రామాల్లోని విద్యార్థులందరినీ ప్రభుత్వ పాఠశాలలకే పంపేలా చూడాలని, తద్వారా సర్కారు బడులను బలోపేతం చేయాలని కోరారు. ప్రతి నెలా నిర్వహించే ఉపాధ్యాయ–తల్లిదండ్రుల సమావేశానికి (PMT) తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరయ్యేలా సర్పంచులు బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి డి.వెంకటేశ్వర్లు, ఎంపీడీవో మోహన్, డిఆర్‌పి సుమన్ పాల్గొన్నారు. అలాగే చెన్నూరు, జైపూర్, భీమారం, హాజీపూర్, మందమర్రి, లక్షెట్టిపేట మండలాల సర్పంచులు, ఇతర అధికారులు హాజరయ్యారు.

# ఆకట్టుకున్న నాగార్జున డైరీ ఆటల పోటీలు





- **ఉత్సాహంగా పాల్గొన్న సిబ్బంది**

**జీ న్యూస్, హుజూరాబాద్:** క్రీడలు శారీరక మానసిక ధృడత్వానికి దోహదం చేస్తాయని నాగార్జున డైరీ చైర్మన్ పుల్లూరి ప్రభాకర్ రావు అన్నారు. బుధవారం రిపబ్లిక్ డే క్రీడోత్సవాలను స్థానిక క్రీడా మైదానంలో ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక బలానికి మార్గం, శారీరక దఢత్వానికి పునాది అన్నారు. క్రీడలు మన జీవితంలో కేవలం వినోదం మాత్రమే కాదు, నిబద్ధత, జట్టుగా పని చేయడం, మానసిక స్థైర్యం వంటి విలువల్ని నేర్పించే సాధనం అన్నారు. నిత్యం విధులలో నిమగ్నమయ్యే సిబ్బంది, క్రీడాకారులుగా ఉత్సాహంగా పాల్గొనటం ఆనందంగా ఉందన్నారు. ఆసక్తిగల క్రీడలలో ఉత్సాహంగా పాల్గొని, పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. పూర్తి స్థాయి క్రీడాకారుల మాదిరి ఉత్సాహంగా, పాల్గొని క్రీడా స్ఫూర్తిని చాటరన్నారు. రిపబ్లిక్ డే ను పురస్కరించుకొని నాగార్జున డైరీ సిబ్బందికి ఆటల పోటీలు నిర్వహించారు. క్రికెట్, టగ్ ఆఫ్ వార్, రన్నింగ్, షాట్ పుట్, మహిళా సిబ్బందికి ముగ్గుల పోటీలు, చెంచా పరుగు, సూదిలో దారం, మ్యూజికల్ చైర్, మగ్గుల పోటీలు తదితర అంశాలపై ఆటల పోటీలు నిర్వహించారు. వీటిలో బాగంగా నిర్వహించిన క్రికెట్ పోటీలు ఆద్యంతం పోటా పోటీగా సాగాయి. టగ్ ఆఫ్ వార్ పోటీలో ఉత్సాహంగా పాల్గొన్న సిబ్బందిని చూసిన స్థానికులు సైతం భారీ సంఖ్యలో చేరుకొని వారిని ఉత్సాహ పరిచారు. డైరీ డైరెక్టర్ పుల్లూరి గణేష్ రావు, సీఈఓ కృష్ణ ప్రసాద్, ఏజీఎం సుధాకర్, మేనేజర్లు ప్రత్యక్షంగా పోటీలలో పాల్గొని సిబ్బందిని ఉత్సాహ పరిచారు. నాయకులు బండ శ్రీనివాస్, వర్దినేని రవీందర్ రావు, తాళ్లపల్లి శ్రీనివాస్ , ఆర్‌కె రమేష్, బత్తుల సమ్మయ్య, కిరణ్ కుమార్ తదితరులు క్రీడలను ప్రారంభించి, తిలకించి క్రీడాకారులను ఉత్సాహ పరిచారు.

# జిల్లాలో ఐదుగురు ఎస్సైల బదిలీ



కోటపల్లి ఎస్ఐ గా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ ఎస్.రాజశేఖర్



భీమారం ఎస్ఐ గా బాధ్యతలు చేపట్టిన ఏ. రాజేందర్



రామకృష్ణాపూర్ ఎస్ఐ గా బాధ్యతలు చేపట్టిన జాడి శ్రీధర్



జైపూర్ ఎస్ఐ గా బాధ్యతలు చేపట్టిన జి.రాజశేఖర్



మందమర్రి సీఐ గా బాధ్యతలు చేపట్టిన పర్వా రమేష్

- **బాధ్యతలు చేపట్టిన నూతన అధికారులు**
- **ప్రజలకు అందుబాటులో ఉంటామని వెల్లడి**

**జీ న్యూస్, మంచిర్యాల:** జిల్లాలోని ఐదు పోలీస్ స్టేషన్లకు నూతన ఎస్సైలు బదిలీపై వచ్చారు. మందమర్రి, రామకృష్ణాపూర్, జైపూర్, భీమారం, కోటపల్లి స్టేషన్లలో విధులు నిర్వహించిన వారి స్థానంలో కొత్త అధికారులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మందమర్రి ఎస్సైగా పి. రమేష్, రామకృష్ణాపూర్ ఎస్సైగా జె. శ్రీధర్ బాధ్యతలు చేపట్టారు. అలాగే జైపూర్ ఎస్సైగా జి. రాజశేఖర్, భీమారం ఎస్సైగా ఎ. రాజేందర్, కోటపల్లి ఎస్సైగా ఎస్. రాజశేఖర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన ఎస్సైలు మాట్లాడుతూ.. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని తెలిపారు. తమ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# నిర్లక్ష్యం వీడండి.. క్షేమంగా ఇల్లు చేరండి

- **ప్రమాదాల నివారణకు అందరూ కలిసి పనిచేయాలి : రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా**
- **'అరైవ్–అలైవ్' వాల్ పోస్టర్ల ఆవిష్కరణ**




**జీ న్యూస్, మంచిర్యాల:** వాహనదారుల చిన్నపాటి నిర్లక్ష్యం జీవితాంతం తీరని బాధను మిగిలిస్తుందని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "అరైవ్–అలైవ్" కార్యక్రమంలో భాగంగా బుధవారం మంచిర్యాల డీసీపీ కార్యాలయంలో నిర్వహించిన 'మీడియా అవుట్‌రీచ్ డే'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీసీపీ ఎగ్గడి భాస్కర్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలో సీపీ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. వాహనదారులు ఇంటి నుంచి బయలుదేరినప్పటి నుంచి తిరిగి క్షేమంగా చేరుకునే వరకు సురక్షిత వాతావరణం కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. హెల్మెట్ ధరించకపోవడం, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి మానవ తప్పిదాల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

**మూడు అంచెల వ్యూహం...**

కమిషనరేట్ వ్యాప్తంగా ప్రమాదాలను అరికట్టేందుకు ఇంజనీరింగ్, ఎడ్యుకేషన్ (అవగాహన), ఎన్‌ఫోర్స్‌మెంట్ (కఠిన అమలు) అనే మూడు విధానాలను పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు సీపీ వివరించారు. గ్రామ, పట్టణ స్థాయిల్లో రోడ్డు భద్రత కమిటీలను ఏర్పాటు చేశామని, ప్రమాదాలు జరిగే ప్రాంతాలను విశ్లేషించి నివారణ చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

**మీడియా పాత్ర కీలకం..**

రోడ్డు భద్రతపై ప్రతి ఇంటికి సమాచారం చేరవేయడంలో మీడియా పాత్ర కీలకమని సీపీ కొనియాడారు. పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటూ ప్రజలను చైతన్యపరచాలని కోరారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రాంగ్ రూట్ ప్రయాణాలు, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వాడటం వంటి ప్రమాదకర చర్యలకు స్వస్తి పలకాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, సీఐలు ప్రమోద్ రావు, అశోక్, శ్రీలత, నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





